క్లుప్తంగా

సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభం



అమ్మవార్లను గద్దెపైకి తీసుకొస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు (బొక్కలగడ్డ) మున్నేరు వంతెన పక్కన ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానం వద్ద రెండు రోజుల పాటు నిర్వహించే సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. మేళ తాళాలు, నృత్యాలు, శివశక్తుల విన్యాసాలతో అమ్మవార్లను ఊరేగింపుగా గద్దెలపైకి చేర్చారు. దేవస్థానం పూజారి ఉప్పిసాయి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఖమ్మం సహకారనగర్: నగరంలో బీఈడీ చదువుతున్న నిరుపేద విద్యార్థిని వి.హర్షిణికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య రూ.15వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. నిరుపేద విద్యార్థులు చదువులో రాణించాలనే ఉద్దేశంతో ఈ సాయం చేసినట్లు పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నవీన్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుడికి..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన రాయిండ్ల ప్రసాద్ గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దనే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న పిండిప్రోలు తోటి ఆటో యూనియన్ కార్మికులు బుధవారం తలాకొంత వేసుకుని రూ.4,300ల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు జాల లింగస్వామి, కార్మికులు నాయిని రవి అయిలపొంగు వెంకన్న, గోపోజి చిరంజీవి, పప్పుల నాగరాజు, చామకూరి అంజయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి జయంతి

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని ఖమ్మంలోని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి లింగాల రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుంతేటి వీరభద్రం, మైనార్టీ నాయకులు రెహమాన్, బాబూరావు, భాస్కర్, వేణు, సుందర్ రావు, గంగాధర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసిన అక్రమాలు



సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న అధికారులు

తిరుమలాయపాలెం: మండలంలోని 2022 ఆర్థిక సంవత్సరంలో ఈజీఎస్ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. బుధవారం తిరుమలాయపాలెం మండల పరిషత్ ఆవరణలో డీఆర్‌డీఏ అదనపు పీడీ శిరీషా, అంబుడ్స్‌మెన్ రమేశ్, విజిలెన్స్ అధికారి పవన్‌లు పాల్గొన్న ప్రజావేదికలో వివరాలను వెల్లడించారు. సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల వారీగా నిర్వహించిన సోషల్ ఆడిట్ నివేదికను అధికారుల ముందు ప్రవేశపెట్టగా.. కూలీల తప్పుడు మస్టర్లు, చేసిన పనులకు తప్పుడు కొలతలు బయటపడ్డాయి. పనుల్లో చేసిన అలసత్వం, అక్రమాలపై అధికారులు జరిమానాలు, రికవరీలు విధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు, ఏపీఓ నర్సింహారావు, ఎస్ఆర్‌పీ రాజు పాల్గొన్నారు.

‘హార్వెస్ట్’ విద్యార్థి ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: గత నెలలో నిర్వహించిన ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫైర్ ఇన్ జూనియర్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో జిల్లా నుంచి తమ విద్యార్థి సీహెచ్. కృష్ణ ఒక్కరే సెకండ్ లెవల్‌కు ఎంపికైనట్లు హార్వెస్ట్ విద్యా సంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. బుధవారం విద్యార్థిని అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రానికి కేటాయించిన 17 సీట్లకు గాను జరిగిన నాలుగు దశల పరీక్షల్లో ప్రతిభ కనబరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ బ్రాంచ్ ఇన్‌చార్జ్ జి.ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	అంబాజీపేట మ్యారేజి బ్యాండ్
సాయిరాం	యాత్ర 2
ఆదిత్య	బూట్‌కట్ బాలరాజు
శ్రీనివాస	కిస్మత్
సుందర్	హనుమాన్

\- ఖమ్మంగాంధీచౌక్

అమ్మినోళ్లకు అమ్మినంతా..!

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

- మద్యం మత్తులో విచక్షణ కోల్పోతున్న యువత
- ఘర్షణలతో హడలెత్తిపోతున్న సర్కిల్
- తాగిన మైకంలో పెరుగుతున్న నేరాలు
- అడ్డూ అదుపు లేకుండా బెల్టు షాపుల నిర్వహణ
- కార్యాలయానికే పరిమితమవుతున్న ఎక్సైజ్ అధికారులు



మద్యం మత్తులో కొందరు పెడదారి పడుతుండడంతో ఘర్షణలతో నేలకొండపల్లి సర్కిల్ అట్టుడుకుతోంది. చిన్న, పెద్ద అనే వ్యత్యాసం లేకుండా మద్యానికి బానిసై కుటుంబంలో చిచ్చురేపుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నిర్వహించడమేనని పలువురు ఆరోపిస్తున్నారు. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన యువత దారుణాలకు తెగబడుతున్నారు. ఇటీవల కాలంలో యువత నడి రోడ్లపై సినిమా ఫక్కీలో పరుగెత్తించిన రీతిలో కొట్టుకోవడం గమనార్హం.

నేలకొండపల్లిలోని ఓ బెల్ట్ షాపు..



ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని 141 గ్రామపంచాయతీల్లో ప్రతీ గ్రామానికి 5 నుంచి 10 వరకు బెల్ట్ షాపులు తెల్లవారు జాము నుంచే విక్రయాలు చేపట్టడంతో మద్యం ఏరులై పారుతోంది. మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయి క్రైమ్ రేటు రోజురోజుకు పెరుగుతోంది. ఇదంతా ఎక్సైజ్ అధికారుల పనితీరుకు నిదర్శనమే చెప్పాలి.

నామమాత్రంగా తనిఖీలు..

నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్‌లో బెల్ట్ షాపులు జోరందుకోవడంతో కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో దర్జాగా విక్రయాలు చేపడుతున్నారు. ఫిర్యాదులు అందితే ఎక్సైజ్ అధికారులు నామమాత్రంగా దాడులు చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో దుకాణాల సంఖ్య రోజురోజుకు భారీగా పెరిగిపోతున్నాయి. ఇప్పటివరకు ఎక్సైజ్ అధికారులు అడపాదడపా తప్ప పెద్దగా దాడులు చేసిన దాఖలాలు లేవు. కాగా, ఇటీవల అక్కడక్కడ పట్టుకున్న మద్యం బాటిళ్లపై వివాదాలు చోటు చేసుకున్నాయి.

ప్రైవేట్ సైన్యం దందా..

ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో మద్యం దుకాణ నిర్వాహకులే ప్రైవేట్ సైన్యాన్ని తయారు చేసుకుని గ్రామాల్లో దందా చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉండడంతో వారి ఆగడాలు మితిమీరిపోతున్నాయి. నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్‌లో మద్యం మత్తు యువతలో చిచ్చు రేపుతుండడంలో సందేహం లేదు. ఈ విషయంపై నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ కుమ్మరి పోశెట్టిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులో లేరు.

కిరాణ దుకాణాల్లోనూ విక్రయం..

గ్రామాలు, పట్టణాలు, తండాల్లో బెల్ట్ షాపులు చాలా వరకు కిరాణ దుకాణాల్లోనే నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లనే బార్లుగా మార్చగా.. రహదారులు వెంట ఉన్న హోటళ్లలో దర్జాగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. దీంతో స్థానిక యువత పెడదారి పడుతున్నారు. చాలా చోట్ల వారి పిల్లలే మద్యాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్ అంతా బెల్ట్ మయంగా మారింది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

గొడవలు చేస్తే సహించేది లేదు..



యువత మద్యం మత్తులో రోడ్డెక్కి గొడవలు చేస్తే సహించేది లేదు. ప్రతీ రోజు డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. ఎక్కడైనా తాగి ఘర్షణలకు దిగితే వెంటనే తమకు సమాచారం అందించాలి. గ్రామాల్లో పోలీసుల గస్తీ పెంచి మరింత పెంచి విస్తృత తనిఖీలు చేపడతాం.

\- బి.సతీశ్, ఎస్సై, నేలకొండపల్లి

అధికారులు పట్టించుకోరు..



యువత పెడదారికి ప్రధానంగా ఎక్సైజ్ అధికారులే కారణం. విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులు వెలుస్తున్న వారికి కనిపించటం లేదా. అధికారుల నిర్లక్ష్యంతోనే మద్యం మత్తు జోగుతుంది. ఇప్పటికైనా మద్యం అమ్మకాలను కట్టడి చేయండి. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తాం.

\- గరిడేపల్లి రామారావు, సుర్దేపల్లి

బెల్ట్ దుకాణాలు మూసేయాలి..



గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను వెంటనే మూసేపించాలి. అధికారులకు చిత్తశుద్ధి లేదు. అనేక మార్లు ఉద్యమాలు చేపట్టినా వినటం లేదు. వెంటనే తగు చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తాం. ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

\- బెల్లం లక్ష్మి, ఐద్వా నాయకురాలు

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పుర వీధుల్లో అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పూర్తి స్థాయిలో పరిష్కరించుకుందామని తెలిపారు. ఈనేపథ్యాన కామేపల్లిలో పునర్నిర్మించిన పీహెచ్‌సీని, గోపాలపురం హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్‌ను ప్రారంభించారు. ఈక్రమంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లు, కుర్చీలు వితరణ చేసిన రామళ్ల రామ్మూర్తి–రాణి దంపతులను శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అజ్మీర విజయలక్ష్మి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏఓ తారాదేవి, వైద్యాధికారి చందన, శిరీషలతో పాటు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, నల్లమోతు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటలు వైద్య సేవలు అందేలా కృషి చేయాలని, 108, 102 అంబులెన్స్ డ్రైవర్లకు విశాంత్రి గది కేటాయించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యకు బుధవారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ మండల పార్టీ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి తేలు రాకేశ్, చల్లా రాజు, భీమిరెడ్డి, రాము, అజ్మీర కిషన్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రారంభమైన స్పెషల్ డ్రైవ్



నేలకొండపల్లి: పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ జమలారెడ్డి

రఘునాథపాలెం/నేలకొండపల్లి: ఈనెల 14వ తేదీ గ్రామాల్లో వరకు ప్రతీ రోజు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓలు రామకృష్ణ, కె.జమలారెడ్డి, ప్రత్యేకాధికారులు లూథర్ విల్సన్, ఎంపీఓలు, శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల సందర్భంగా రఘునాథపాలెం మండలంలో ఎంపీడీఓ, ఎంపీఓ, ప్రత్యేకాధికారులు, నేలకొండపల్లి మండలంలో ఎంపీడీఓలు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే కార్యదర్శి లేదా తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం చేపట్టిన వారం రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శులు దేవేందర్, వెంకటేశ్వర్లు, రవికుమార్, రామారావు, బోళ్ల వీరబాబు గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

తిరుమలాయపాలెం: త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పానుకుల సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని తిరుమలాయపాలెంలో టాలెంట్ టెస్టుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 15–17 తేదీల్లో మండల, టౌన్ స్థాయిలో నిర్వహించే ఈ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో మండలానికి 5 గురు చొప్పున ఎంపిక చేసి 27వ తేదీన ఖమ్మం కేంద్రంగా జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గాదే వరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు గంగాధర్, ప్రసాద్, ధనమూర్తి, శ్రీనివాస్‌రావు, బాబు, కట్టకూరు మహేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు సహకరించండి

కూసుమంచి/నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని టీఎస్ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, నోడల్ అధికారి నాగప్రసాద్, నేలకొండపల్లి విద్యుత్ సంస్థ ఏఈ కె.రామారావు కోరారు. బుధవారం కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో వివరాలు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది బిల్లులను ఇచ్చే క్రమంలో వినియోగదారుల ఆధార్, రేషన్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్లతో పాటు ప్రజాపాలనలో ఇచ్చిన రసీదు నంబర్లను నమోదు చేయాలని పేర్కొన్నారు. యాజమానులు ఇంటి వద్ద లేని పక్షంలో మీటర్ వద్ద వివరాలు ఉంచాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ కోక్యానాయక్, ఆయా సబ్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ సేవలు అభినందనీయం

ఖమ్మం అర్బన్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంలో గురువుగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ఫాదర్ బొంతు ప్రసాద్ సేవలు అభినందనీయమని ఎంఎస్ఎఫ్ఎస్ విశాఖపట్నం వెరి రెవరెండ్ ఫాదర్ బవిరి సురేశ్‌బాబు అన్నారు. నగరంలోని బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సిల్వర్ జూబ్లి వేడుకలను మంగళవారం నిర్వహించి పిన్సిపాల్‌ను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రావిన్షియల్ కౌన్సిలర్ రెవరెండ్ ఫాదర్ జోసెఫ్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి.ప్రసాద్ పాల్గొన్నారు.


టీపీటీఎఫ్ ర్యాలీ



ప్రచారం చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ కోరారు. బుధవారం నగరంలోని పాఠశాలల్లో సభలు విజయవంతం చేయాలని ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 11న సాయంత్రం వేలాది మంది ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, భాస్కర్, పుల్లయ్య, సుధాకర్, మాధవరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘తమ్మినేని’కి స్వాగతం



వీరభద్రంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల అనారోగ్యం బారిన పడగా, చికిత్స అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తొలిసారి బుధవారం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని సుందరయ్య భవనం వద్ద ఆయనకు నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలకు తమ్మినేని కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు పోతినేని సుదర్శన్, ఎం.సాయిబాబు, యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, బుగ్గవీటి సరళ, బండి రమేష్, మాచర్ల భారతి, భూక్య వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



ఏఎన్ఎంలతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: నేషనల్ హెల్త్ మిషన్‌లో 16 ఏళ్లుగా పని చేస్తున్న రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యాన బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రెండో ఏఎన్ఎం యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా రెండో ఏఎన్ఎంల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. గత ప్రభుత్వం రెండవ ఏఎన్ఎమ్‌ల సమస్యలను పట్టించుకోలేదని, వారి శ్రమను మాత్రమే వాడుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీరిని రెగ్యులర్ చేయడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ, ఎం.నాగమణి, ఏ.శైలజ, పి.భవాని, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వినతి..

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని, ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీనిఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడగా.. సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు ఫర్వీన్, తరుణ్, శరణ్య, వెంకటలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి..

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు కూడా మంచిగా పని చేసి పాఠశాలలను పునఃప్రారంభించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టా శ్రీనివాసరావు, కొమ్మినేని అనిల్‌కుమార్, నాయకులు కదూస్, చావా శ్రీదేవి, రజిత, శ్రీలత, రామకృష్ణ, రాజకుమారి, కృపాబాలానందం, వీరభద్రరావు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ డైట్ బిల్లులను వెంటనే విడుదల చేయించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ డిమాండ్ చేశారు. బుధవారం విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ.. వసతిగృహాలు, గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందడం లేదని, బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నాణ్యమైన భోజనం అందడం లేదని అన్నారు. ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ అటానమస్ పీజీ కళాశాలకు సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే భవిష్యత్‌లో సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు సాగర్, గోపి, భాస్కర్, గాంధీ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి కార్మికుల ధర్నా



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఖమ్మం వైద్యవిభాగం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులు విధుల బహిష్కరించి సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల మద్దతుతో బుధవారం ఆస్పత్రి ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వట్లేదన్నారు. ఫలితంగా వారి కుటుంబ పోషణతో పాటు ఇంటి అద్దె భారంగా మారిందని, జీతాలు సమయానికి చెల్లించాలని కాంట్రాక్టర్‌కు మొరపెట్టుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యాన స్పందించిన అధికారులు కార్మికులకు రెండు నెలల వేతనాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.విక్రమ్, ఎన్.నాగేశ్వరరావు, కె.శ్రీను, యూనియన్ నాయకులు విజయమ్మ, వెంకటరమణ, అంబేడ్కర్, ఉపేందర్, రాములమ్మ, రాధ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)ల ద్వారా సుబాబుల్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర నిర్ణయించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టన్నుకు రూ.9 వేలు ధర కంపెనీ నిర్ణయించిందని, మధ్య దళారీల దోపిడీ వల్ల రూ.5 వేల నుంచి రూ.7 వేలు మించి రైతు పొందడం లేదన్నారు. ఏఎంసీల ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మధ్య దళారీలను అరికట్టాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

‘గ్యారంటీ’గా అమలు చేస్తుంది..

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని, ఓటమి పాలైన బీఆర్ఎస్ కార్యకర్తలు అసహనానికి లోనై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యలు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం, డిప్యూటీ సీఎంలపై బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని చేతిలో పెడితే అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. ప్రజలు బీఆర్ఎస్ నాయకులను పట్టించుకోకపోవడంతో వారు బూతు పురాణం ఎత్తుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా అమలు చేస్తుందని, ఎవరైనా ప్రజాతీర్పును గౌరవించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు లకావత్ సైదులు, రఫీదా ముస్తఫా, పల్లెబోయిన భారతీచంద్రం, రబ్బానీ, హుస్సేన్, కొంటేముక్కల నాగేశ్వరరావు, శంకర్ నాయక్,ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

11న త్రిశూల్ దీక్ష..

ఖమ్మంగాంధీచౌక్: ఈ నెల 11వ తేదీ(ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి త్రిశూల్ దీక్ష మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అయోధ్య రామ మందిరంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగస్వాములై 16 నుంచి 40 ఏళ్ల వయసు గలవారు ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు అర్హులని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనాల రామకృష్ణ, బొడ్డు కృష్ణ, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ బ్రహ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ నేరెళ్ల శ్రీనివాస్, తాటికొండ రామకృష్ణలు తెలిపారు. వివరాలకు 93464 03188, 90630 66036 నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

11 నుంచి మహా సభలు

ఖమ్మంరూరల్: ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యాన జరగనున్న రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహా సభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వీరబాబు తెలిపారు. బుధవారం మండలంలోని మంగళగూడెం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు పి.ఐలయ్య, యాదగిరి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలో ఆస్పత్రి వ్యర్థాలు



టీఎన్జీవోస్ కాలనీలో డంప్ చేసిన వ్యర్థాలు



ఆస్పత్రి వ్యర్థాలను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆస్పత్రిలో కాలంచెల్లిన మందులు, ఇతర ఆస్పత్రి వ్యర్థాలను ఓ వాహనంలో తరలించి బీసీ కాలనీలోని టీఎన్జీవోస్ కాలనీ నివాస ప్రాంతంలో మంగళవారం రాత్రి డంప్ చేశారు. ఈక్రమంలో ఆ వాహనాన్ని, డ్రైవర్‌ను స్థానికులు అడ్డగించి టూటౌన్ పోలీసులకు అప్పగించారు. అనంతరం ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరడంతో బుధవారం కేఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఏఈ మల్లెల శ్రీనివాస్‌లు ఆస్పత్రి వ్యర్థాలను పరిశీలించారు.ఈనేపథ్యాన డంపింగ్ యార్డ్ ఈ ప్రాంతంలో ఉండడంతోనే ఇలా వ్యర్థాలను రోడ్డు వెంట పోసి వెళ్తున్నారని, దీనిని ఇక్కడ నుంచి మార్చాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తొండల సత్యనారాయణ, బోడా వీరన్న, సంద్ర, వెంకటేశ్వర్లు, లెనిన్, క్రాంతి, నాగాచారి, కంకణాల బాబు, మద్దినేని నాగేశ్వర రావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.